

అర్ధరాత్రి.. అనుకోని ఆపద

వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి

రోజూలాగే వారు నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి సమయం. .. పాము రూపంలో బాలుడిని మృత్యువు హరిస్తే.. యువకుడిని విద్యుదాఘాతం బలిగొంది. జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఈ ఘటనలు రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపాయి.

పాముకాటుకు బలి..


కృష్ణ

నాగిరెడ్డిపేట, న్యూస్‌టుడే: నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్‌పేట్‌కు చెందిన విద్యార్థి పోసన్నగారి కృష్ణ (17) మండల కేంద్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో నిద్రలో పాము కరవడంతో కుటుంబీకులకు చెప్పాడు. వారు వెంటనే చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండంగా మృతి చెందాడు.

విద్యుదాఘాతానికి యువకుడు..


అనిల్

సదాశివనగర్, న్యూస్‌టుడే: ఇంట్లో నిద్రిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగ కాలుకు తగిలి సదాశివనగర్ మండలం యాచారం తండాకు చెందిన యువకుడు అనిల్(23) చనిపోయినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. గురువారం అర్ధరాత్రి అనిల్ ఇంట్లో మంచంపై నిద్రిస్తుండగా కరెంట్ తీగ కాలుపై పడడంతో విద్యుదాఘాతం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రగ్గులు ఇవ్వరు.. వేడి నీరు పెట్టరు | ఎమ్మెల్యేకు త్రుటిలో తప్పిన ప్రమాదం | ఆవులపై విషప్రయోగం 6లో


ఈనాడు కామారెడ్డి

పదేళ్లుగా.. అతివలకు తోడుగా

భరోసా కల్పిస్తున్న షీ బృందాలు

న్యూస్‌టుడే, కామారెడ్డి నేరవిభాగం

వేధింపులకు గురవుతున్న మహిళలకు అండగా నిలుస్తున్నాయి షీ బృందాలు. అక్టోబరు 24వ తేదీకి షీటీం వ్యవస్థ పదేళ్లు పూర్తి చేసుకుంది. జిల్లాలో షీ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ అతివలకు అండగా నిలుస్తున్నాయి. ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ సబ్ డివిజన్ల పరిధిలో ఒక్కో షీ బృందం పనిచేస్తోంది. ఏఎస్పీ పర్యవేక్షణలో ఇవి పనిచేస్తున్నాయి. వీరిని నడిపించేందుకు సీఐ, ఎస్సై, ఏఎస్సై స్థాయి పోలీసు అధికారులతో పాటు మహిళా, పోలీసు కానిస్టేబుళ్లు షీ బృందంలో సభ్యులుగా ఉండి పనిచేస్తున్నారు.



విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

పాఠశాలలు, కళాశాలల్లో, రైల్వేస్టేషన్లలో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీ బృందాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌లపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా తరచూ మంచి-చెడు (గుడ్-బ్యాడ్ టచ్) స్పర్శలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి మహిళల్లో చైతన్యం తెచ్చారు. జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన గోడప్రతులను అతికిస్తున్నారు. ఈ గోడప్రతులపై ఉన్న షీ టీం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఎక్కడినుంచైనా అంతర్జాలంలో పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని అవగాహన కల్పిస్తున్నారు.

85 హాట్‌స్పాట్‌ల గుర్తింపు

జిల్లావ్యాప్తంగా తరచూ నేరాలు జరిగే 85 ప్రదేశాల(హాట్ స్పాట్)ను గుర్తించి పోలీసులు మఫ్టీ దుస్తుల్లో గస్తీ కాస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు 25వ తేదీ వరకు 2391 సార్లు హాట్ స్పాట్‌లను సందర్శించి పరిస్థితిని పర్యవేక్షించారు. ఆకతాయిలను గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వారిలో మార్పు రాకపోతే చట్టరీత్యా చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

జిల్లాలో షీ టీంల ద్వారా కేసుల నమోదు, పరిష్కారమవుతున్న తీరు

సంవత్సరం	2023	***
అవగాహన సదస్సులు	643	536
ఈవ్‌టీసింగ్ కేసులు	161	94
ఎఫ్ఐఆర్‌లు	45	62
పెట్టీ కేసులు	141	108
జనరల్ కేసులు	156	142
కౌన్సిలింగ్‌లు	–	66

*** 2024(ఇప్పటి వరకు)


ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

జాగ్రత్తలు పాటిస్తే తప్పించుకోవచ్చు

- ఆకతాయిలు ప్రేమ పేరుతో వెంటపడితే షీ బృందాల నంబరు 8712686094కు కాల్ చేయాలి.
- సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలి. ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతను దృష్టిలో ఉంచుకోవాలి. గుర్తుతెలియని వ్యక్తులతో పరిచయం పెంచుకోకపోవడం ఉత్తమం.

ధైర్యంగా ముందుకు రావాలి

- సింధుశర్మ, జిల్లా ఎస్పీ



విద్యార్థినులు, మహిళలు, యువతులు అన్యాయానికి గురైనప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు చేసిన వారి పేర్లను, చిరునామాను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టము. లైంగిక దాడులు, ఈవ్‌టీజింగ్‌కు గురవకుండా ఉండేందుకే షీ బృందాలను పటిష్ఠం చేస్తున్నాం.


జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో షీ బృందాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

భరోసా నింపుతున్నాం



నిత్యం ఏదో చోట షీ టీంపై అవగాహన కల్పిస్తూ.. మహిళల్లో భరోసా నింపుతున్నాం. జనసమూహ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నాం. షీ బృందాలతో మహిళల్లో చైతన్యం నింపుతున్నాం. తమకు జరిగిన అన్యాయాలపై ఫిర్యాదు చేసేందుకు ముందుకు వచ్చే మహిళలసంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. **- సౌజన్య, షీ టీం కానిస్టేబుల్**

ప్రతిష్ఠ పెంచేలా.. పారదర్శక పాలన



'న్యూస్‌టుడే'తో తెవివి వీసీ ఆచార్య టి. యాదగిరిరావు

న్యూస్‌టుడే, తెవివి క్యాంపస్

ముఖాముఖి

తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ పెంచేలా, పారదర్శక పాలన అందిస్తానని ఉపకులపతి ఆచార్య టి.యాదగిరిరావు అన్నారు. విద్యార్థుల సమస్యల్ని తీరుస్తూ, వర్సిటీ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఆయన పేర్కొన్నారు. 'న్యూస్‌టుడే' నిర్వహించిన ముఖాముఖిలో ఆయన పలు అంశాలు వెల్లడించారు. అవి ఆయన మాటల్లోనే..

ఇంజినీరింగ్‌కు తొలి ప్రాధాన్యం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడం బాధాకరం. వర్సిటీలో ఓ కళాశాలలో ఇంజినీరింగ్ కోర్సులు ప్రవేశ పెట్టేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య అందేందుకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

పరిధి విస్తరణకు కృషి చేస్తా

తెవివి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకే పరిమితమైంది. అఫిలియేషన్ విస్తరించి నిర్మల్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలను వర్సిటీ పరిధిలోకి తెచ్చేలా ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. పరిధి పెరిగితే అనేక ప్రయోజనాలుంటాయి.

చట్టం పరిధిలో నడుచుకుంటా

వర్సిటీలో గతంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరిగింది. ఇది ప్రభుత్వ అధీనంలోని అంశం. చట్టం పరిధిలో ప్రభుత్వ ఆదేశాలతో నా బాధ్యతలు నిర్వర్తిస్తా. 2014లో నియామకమైన అధ్యాపకుల అంశం కోర్టు పరిధిలో ఉందని నా దృష్టికి వచ్చింది. పదోన్నతుల అంశంపై కోర్టు అడ్డంకులు పూర్తిగా తొలగి, ప్రభుత్వ అనుమతి ఇస్తే ఆలోచన చేస్తా.

న్యాక్ గుర్తింపునకు సిద్ధం

మెరుగైన న్యాక్ గ్రేడ్ సాధించేందుకు కసరత్తు ప్రారంభించాం. విభాగాధిపతులతో సమావేశం నిర్వహించి నివేదిక తయారుచేయాలని ఆదేశించా. వీలైనంత త్వరలో న్యాక్‌కు సెల్ఫ్ రిపోర్టు సమర్పిస్తాం. న్యాక్ బృందం వచ్చేలోపు అవసరమైన ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉంటాం.

అధ్యాపకులు బాధ్యతగా మెలగాలి

వర్సిటీలోని అధ్యాపకులందరూ బాధ్యత పని చేయాలి. సకాలంలో విధులకు హాజరై విద్యార్థులకు పాఠాలు బోధించాలి. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. ఉద్యోగులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి వర్సిటీ అభివృద్ధికి పాటు పడాలి. వ్యక్తిగత ప్రయోజనాలకు పోకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి, వర్సిటీ సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యం.

విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యం

వర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తా. క్రీడా మైదానం, ఆటలకు ప్రోత్సాహం, అవుట్ డోర్ స్టేడియం, బాల బాలికలకు వేర్వేరుగా జిమ్‌ల ఏర్పాటు చేసేలా చూస్తా. కొత్త అంబులెన్సును అందుబాటులోకి తెస్తా.

రూసా నిధుల వినియోగం

రూ. 20 కోట్ల రూసా నిధుల్లో రూ.10 కోట్లతో సైన్స్ కళాశాల నిర్మిస్తున్నారు.. నిర్మాణం తుది దశలో ఉంది. రూ.6 కోట్లతో మహిళా వసతి గృహం నిర్మాణానికి టెండర్లు పిలుస్తాం. రూ.2 కోట్లతో రోడ్లు, ఫుట్‌పాత్ నిర్మాణం, మరో రూ.2 కోట్లతో కంప్యూటర్లు, మౌలిక వసతులకు వినియోగిస్తాం.

కుడా ఏర్పాటుకు ఆమోదం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో కుడా(కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటుకు సర్కారు ఆమోదం తెలిపింది. తాజాగా ఉత్తర్వు నం.174 జారీ చేసింది. మూడు పురపాలికల పరిధిలో 460 గ్రామాలను కూడా పరిధిలోకి తెచ్చారు. ఇప్పటికే అధికారులు కసరత్తు చేసి ప్రతిపాదనలను సర్కారుకు పంపారు. ఈ నెల 15వ తేదీన గెజిట్ విడుదలైంది. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి బల్దియాల పరిధిలోని వివిధ గ్రామాలను 'కుడా' పరిధిలోకి తెచ్చారు. దీనికి ఒక ఛైర్మన్‌తోపాటు వైస్‌ఛైర్‌పర్సన్, ముగ్గురు సభ్యులను నియమించనున్నారు.

రగ్గులు ఇవ్వరు.. వేడి నీరు పెట్టరు

● ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థుల అవస్థలు

పరిశీలన

చలికాలం రానే వచ్చింది. ప్రభుత్వ వసతిగృహాలు సమస్యల నిలయాలుగా మారాయి. అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చలి నుంచి రక్షణ కోసం కప్పుకొనేందుకు దుప్పట్లు, పడుకునేందుకు మంచాలు లేక అవస్థల పాలవుతున్నారు. కిటికీలు, దర్వాజాలకు తలుపులు లేవు. అట్టముక్కలు అడ్డం పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. స్నానం చేద్దామంటే వేడి నీటి వసతి లేదు. ఇలా ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారు. గురు, శుక్రవారాల్లో 'న్యూస్‌టుడే' ఉమ్మడిజిల్లాలోని పలు వసతిగృహాలు పరిశీలించగా ఎన్నో సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

ఇంటి నుంచి తెచ్చుకోవడమే..!


పెచ్చులూడిన పైకప్పు

●● **వసతిగృహం పేరు:** షెడ్యూల్డ్ కులాల(బాలుర) కళాశాల వసతిగృహం, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల
✤✤ **విద్యార్థులు సంఖ్య:** 86
☆☆ **దుప్పట్లు, రగ్గులు ఎంతమందికి ఉన్నాయి:** దుప్పట్లు, రగ్గులు ఇంకా రాలేదు.
✪✪ **కిటికీల పరిస్థితి :** మూడు గదుల్లో కిటికీలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. భవనం శిథిలావస్థకు చేరగా పైకప్పు పెచ్చులూడుతుండటంతో విద్యార్థులు భయంగా గడుపుతున్నారు. మంచాలు లేకపోవడంతో కిందనే నిద్రిస్తున్నారు. దోమల బెడద ఉన్నట్లు విద్యార్థులు వాపోయారు.
✦✦ **స్నానాలు చేసేందుకు వేడినీటి వసతి ఉందా:** లేదు.
☛ **వార్డెన్ వివరణ:** ఇటీవల బదిలీపై వచ్చానని, రాగానే రూ.20వేలకు పైగా ఖర్చు చేసి మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్తు మరమ్మతులు చేశామని, దోమల నివారణకు ప్రతి గదికి గుడ్‌నైట్ మిషన్లు అందజేశామని వార్డెన్ నవీన్ వివరించారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు.
- న్యూస్‌టుడే, ఆర్యనగర్

మూడేళ్లు నిలిచిన దుప్పట్ల పంపిణీ


తలుపు లేని కిటికీ, దెబ్బతిన్న తలుపు

●● గిరిజన బాలుర కళాశాల వసతిగృహం, దారుగల్లి ✤✤ 89 ☆☆ మూడేళ్లుగా దుప్పట్లు, రగ్గులు రావడం లేదని విద్యార్థులు వివరించారు. మంచాలతో పాటు పరుపులు గతంలోనే సరఫరా చేశారు. నాణ్యతా లోపంతో పనికి రాకుండా పోయాయి. ✪✪ మూడు గదుల్లో దర్వాజాలతో పాటు కిటికీలకు తలుపులు దెబ్బతిన్నాయి. ✦✦ లేదు ☛ బదిలీపై రాగానే వసతిగృహంలోని నీటి సమస్యను తొలగించేందుకు బోరు వేయించామని, ఆర్వోప్లాంటు లేనప్పటికీ రక్షిత నీరు అందజేస్తున్నామని, త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని వార్డెన్ గోదావరి తెలిపారు. **- న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ**

దోమ తెరలకు చిల్లులు


కిటికీలకు సరిగా లేని దోమతెర జాలి

●● సమీకృత వసతి గృహం, న్యాల్‌కల్ రోడ్డు ✤✤ 153 ☆☆ దుప్పట్లు జూన్‌లోనే పంపిణీ చేసినా.. రగ్గులు ఇవ్వలేదు. ✪✪ కిటికీలకు దోమల జాలీలున్నా అక్కడక్కడ ఊడిపోయాయి. ✦✦ లేదు. ☛ రగ్గులు, స్వెటర్లు రావాల్సి ఉంది. రాగానే విద్యార్థులకు పంపిణీ చేస్తాం. కిటికీలకు దోమతెర జాలీలు సరిగా లేనందునా మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు తెలియజేశాం. **- న్యూస్‌టుడే, ఖలీల్‌వాడి**

నేలపైనే నిద్ర


ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లు కప్పుకొని నిద్రపోతున్న విద్యార్థులు

●● బీసీ బాలుర కళాశాల వసతిగృహం ✤✤ 61 ☆☆ కళాశాల వసతిగృహాలకు కేవలం ఆశ్రయం మాత్రమే కల్పిస్తున్నారు. ఇంటి నుంచి తెచ్చుకున్న రగ్గులే కప్పుకొని నిద్రపోతున్నారు. ✪✪ కిటికీలకు జాలీలు ఉన్నాయి. పలు గదుల్లో తలుపు సందుల నుంచి గాలి లోనికి వస్తోంది. ✦✦ లేదు. ☛ వార్డెన్ నరేశ్ స్పందిస్తూ.. పిల్లలకు వేడి నీటి స్నానం కోసం యంత్రాలు లేక సమస్య నెలకొందన్నారు. సర్కారు నుంచి స్పందించి యంత్రాలు అందించాలని కోరారు. **- న్యూస్‌టుడే, కామారెడ్డి విద్యావిభాగం**

టెండర్ల దశలోనే..!


వినియోగంలోకి రాని ఆర్వోప్లాంటు

●● షెడ్యూల్డ్ కులాల(బాలుర) కళాశాల వసతి గృహం, నామ్‌దేవ్‌వాడ ✤✤ 170 ☆☆ పంపిణీ చేయలేదు. ✪✪ బాగానే ఉన్నాయి. ✦✦ వేడి నీటి వసతి లేదు. తాగునీటికి సంబంధించిన ఆర్వో ప్లాంటు వినియోగంలో లేదు. ☛ రగ్గులు, దుప్పట్లకు టెండర్లు నిర్వహిస్తున్నారని, త్వరలోనే సరఫరా చేసే అవకాశముందని వార్డెన్ జీవన్ తెలిపారు. ఆర్వో ప్లాంటుతో ఎక్కువ నీరు వృథా అవుతుందని ఇష్టం లేక వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. తాగడానికి రక్షిత మంచి నీరు ఇస్తున్నట్లు చెప్పారు. **- న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం, ఇందూర్ సిటీ**

పాడైన జాలీలు.. కిటికీకి కాగితాలు


కిటికీకి అడ్డుగా పెట్టిన కాగితాలు

●● షెడ్యూల్డ్ కులాల కళాశాల వసతిగృహం ✤✤ 56 ☆☆ అందరికి దుప్పట్లు, రగ్గులు ఉన్నాయి. మంచాలు లేకపోవడంతో నేలపై పడుకుంటున్నారు. కింద పర్చుకోవడానికి ఇంటి నుంచి బ్లాంకెట్లు తెచ్చుకున్నారు. ✪✪ వసతిగృహంలో రెండు గదుల్లో కిటికీలకు కాగితాలను అతికించారు. ✦✦ ఉంది. ☛ చిన్నపాటి సమస్యల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని.. త్వరలోనే పనులు చేపడతామని ఇన్‌ఛార్జి వార్డెన్ నాగరాజు తెలిపారు.
-న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం

చన్నీళ్ల స్నానమే..!

●● బీసీ బాలుర వసతిగృహం, గడీ రోడ్డు-కామారెడ్డి ✤✤ 80 ☆☆ అందరికీ పంపిణీ చేశారు. ✪✪ కిటికీలు, తలుపులకు మరమ్మతులు చేశారు. చలి లోపలికి రాకుండా చర్యలు చేపట్టారు. ✦✦ లేదు. ☛ బీసీ బాలుర వసతిగృహంలో దుప్పట్లు, రగ్గులు విద్యార్థులకు పంపిణీ చేశాం. వేడి నీటికి యంత్రాలు లేక ఇబ్బందులున్నాయి. యంత్రాలు ఏర్పాటుచేస్తే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుందని పిట్ల పవన్ చెప్పారు.
- న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

ఇక్కడ అధ్వానం


చలికి తట్టుకోలేక చాప అడ్డుపెట్టుకున్న దృశ్యం

●●: గురుకుల పాఠశాల ఉప్పల్‌వాయి. ✤✤ 560 మంది ☆☆ దుప్పట్లు 130 మందికి రాలేవు. ✪✪ వసతి గృహంలో కిటికీల పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రతి గదిలో కిటికీలు విరిగిపోవడంతో చాప అడ్డుగా పెట్టారు. దోమల జాలి దెబ్బతిన్నాయి. ✦✦ లేదు. ☛ దోమలు రాకుండా జాలీల ఏర్పాటుకు, కిటికీలు, తలుపుల మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తి చేయిస్తాం. **- న్యూస్‌టుడే, రామారెడ్డి**

రెండు హాస్టళ్ల విద్యార్థులు ఒకే చోట

●● ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల వసతి గృహం ✤✤ ఎస్టీ విద్యార్థులు.. 100, ఎస్సీ విద్యార్థులు 200మంది ☆☆ వసతి పొందుతున్న అందరికి సొంతంగా తెచ్చుకున్న దుప్పట్లు, రగ్గులు ఉన్నాయి ✪✪ నూతన భవనం కావడంతో కిటికీలు, దోమతెరలు ఉన్నాయి ✦✦ ఇక్కడ గీజర్లు లేవు. దీంతో విద్యార్థులు చలికాలంలో చన్నీళ్ల స్నానమే చేయాల్సిన పరిస్థితి ఉంది. ఆర్మూర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడి విద్యార్థులను ఇక్కడికి పంపించడంతో వసతులు సరిపోవడం లేదు.
☛ ఎస్సీ వసతి గృహం కోసం అద్దె భవనం చూశాం. త్వరలోనే అక్కడికి తరలిస్తామని వార్డెన్ సురేశ్ తెలిపారు. ప్రభుత్వం నుంచి వస్తేనే రగ్గులు, దుప్పట్లు అందజేస్తామన్నారు. ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కలు లోపలికి వస్తున్నాయి. **- ఆర్మూర్ పట్టణం**

స్థలం లేక.. ఆరుబయటే వాహనాలు



కామారెడ్డి బోధనాసుపత్రి ఇరుకుగా మారింది. 28 ఏళ్ల క్రితం వంద పడకల ఆసుపత్రి ఏర్పాటైంది. ఆ తర్వాత జిల్లా ఆసుపత్రి, బోధనాసుపత్రిగా ఏర్పాటైంది. స్థాయి పెరిగినా.. ఇక్కడ రద్దీకి అనుగుణంగా వసతులు సమకూరలేదు. వాహనాల పార్కింగ్‌కు తీవ్ర కష్టతరమవుతోంది. మొన్నటి వరకు ఆసుపత్రి ఆవరణలో వాహనాలు నిలిపారు. అత్యవసర వేళల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో సిబ్బందిని నియమించి వాహనాలను లోనికి అనుమతించడం లేదు. ప్రైవేటు వాహనాలను బయటే ఉంచి ఆసుపత్రి లోనికి వెళ్లడంతో రోడ్డుపై ట్రాఫిక్ ఇక్కట్లు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని న్యూస్‌టుడే శుక్రవారం క్లిక్‌మనిపించింది. **- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం**

మొదలుకాని కొనుగోళ్లు.. రోడ్డుపై ధాన్యపు రాశులు



రోడ్డుకు ఇరువైపులా ధాన్యం ఆరబెట్టిన ఈ చిత్రం మోపాల్ మండలంలోని బాడ్సి గ్రామ శివారులోనిది. జిల్లాలో వానాకాలం వరి కోతలు నెల రోజుల క్రితం ప్రారంభం కాగా.. ప్రస్తుతం జోరందుకున్నాయి. దసరా తర్వాత కొనుగోలు కేంద్రాలు తెరుస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా.. ఇంకా రైస్ మిల్లర్లతో ఒప్పందం కాకపోవడంతో అధికారికంగా కొనుగోళ్లు మొదలు కాలేదు. దీంతో కోసిన ధాన్యాన్ని రోడ్లపైనే రోజుల తరబడి కుప్పలుగా పోసి నిల్వ చేస్తూ అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి స్థలాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాలు, రోడ్లపై ఖాళీ స్థలాలు ఉంటే రైతులు ముందుగానే ప్లాస్టిక్ కవర్లు అక్కడ పరిచి తమ అధీనంలోకి తీసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి.
- ఈనాడు, నిజామాబాద్


డీసీవో రామ్మోహన్‌కు కోర్టు ఉత్తర్వుల కాపీని అందిస్తున్న బస్వాపూర్ విండో వైస్ ఛైర్మన్ మద్ది స్వామి, డైరెక్టర్లు

కోర్టు ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలి

భిక్కనూరు, న్యూస్‌టుడే: బస్వాపూర్ సింగిల్ విండో పాత పాలకవర్గాన్ని యథావిధిగా కొనసాగించాలని, ఛైర్మన్ కిష్టాగౌడ్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఫలితాలను బహిర్గతం చేయాలని బస్వాపూర్ విండో వైస్ ఛైర్మన్ మద్ది స్వామి డిమాండ్ చేశాడు. ఆయనతో పాటు విండో డైరెక్టర్లు పాతూరి రాజు, సుధాకర్‌రెడ్డి, గౌరిగారి రాంరెడ్డి, అద్దంకి నర్సింలు, మోతె క్రిష్టారెడ్డి శుక్రవారం డీసీవో రామ్మోహన్‌ను కలిసి హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రతులను అందజేశారు. గెజిట్ ప్రచురణ లేకుండా బస్వాపూర్ సొసైటీని విభజించడాన్ని హైకోర్టు గురువారం వెలువరించిన తీర్పులో తప్పుపట్టిన విషయం తెలిసిందే. డీసీవో రామ్మోహన్‌ను వివరణ కోరగా.. హైకోర్టు ఉత్తర్వులను తప్పకుండా పాటిస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా గెజిట్ నోటిఫికేషన్ వచ్చే వరకు బస్వాపూర్ విండో పాత పాలకవర్గం యథావిధిగా కొనసాగనున్నట్లు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే కిష్టాగౌడ్ తన ఛైర్మన్ పదవిని కోల్పోయి వైస్ ఛైర్మన్ మద్ది స్వామికి విండో అధ్యక్ష పదవి వరించనుంది. సహకార శాఖ అధికారులు శనివారం అధికారికంగా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యేకు త్రుటిలో తప్పిన ప్రమాదం

సదాశివనగర్, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ భాజపా ఎమ్మెల్యే పాయల్‌శంకర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం ఎమ్మెల్యే హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తుండగా కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం పద్మాజివాడిక్రాసు రోడ్డు వద్ద 44నంబరు జాతీయరహదారిపై ఆయన ప్రయాణిస్తున్న కారును లారీ వెనక నుంచి ఢీకొట్టింది. కారు పాక్షికంగా దెబ్బతింది. ప్రమాదంలో ఎమ్మెల్యే సురక్షితంగా బయటపడ్డారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు


క్రీడాకారులతో వీసీ ఆచార్య యాదగిరిరావు

చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తాం

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తామని వీసీ ఆచార్య టి.యాదగిరిరావు అన్నారు. ఈ నెల 26 నుంచి 29 వరకు చెన్నైలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీకి ఎంపికైన నికేశ్(గిరిరాజ్ కళాశాల), అనిల్, సాయికుమార్(తెవివి), రోహన్(ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కామారెడ్డి) క్రీడాకారులను వీసీ అభినందించారు. స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, పీడీ నేత తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

తెవివి క్యాంపస్: హాల్స్ లైఫ్ సైన్సెస్ కంపెనీ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన తెవివి భిక్కనూరు దక్షిణ ప్రాంగణ జువాలజీ విభాగం విద్యార్థులు డి.సరిత, ఎం.అవినాశ్, అజయ్‌గౌడ్‌ను శుక్రవారం వీసీ ఆచార్య యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి అభినందించారు. జువాలజీ విభాగం స్థాపించిన తర్వాత తొలిసారిగా విద్యార్థులు ఈ అవకాశం పొందడం వర్సిటీకి గర్వకారణమన్నారు. వీసీని జిల్లా డీసీఈబీ(డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు) కార్యదర్శి బి.సీతయ్య, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ వేర్వేరుగా కలిసి సన్మానించారు.

భవనాల పరిశీలన

తెవివి క్యాంపస్: తెవివిలో నిర్మాణ దశలో ఉన్న సైన్స్ కళాశాల భవనాన్ని శుక్రవారం వీసీ ఆచార్య యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి పరిశీలించారు. న్యాయ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని, బాలికల వసతి గృహాన్ని, ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. సమస్యలు రాకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని చీఫ్ వార్డెన్ మహేందర్‌ను ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తెవివి క్యాంపస్: తెవివిలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం వీసీ ఆచార్య యాదగిరిరావుకు వినతిపత్రం ఇచ్చారు. బోధన, బోధనేతర ఖాళీలు భర్తీ చేయాలని, ల్యాబ్‌లు మెరుగుపర్చాలని, మరో మహిళా హాస్టల్ నిర్మించాలని కోరారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ, వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు సాయి, అమృత్‌చారి, నాయకులు నాగరాజు, పావని, బాంధవ్య, సమీర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ సర్వేను పక్కాగా నిర్వహించాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఎల్ఆర్ఎస్ సర్వేను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. జిల్లాకేంద్రం పరిధిలోని ఒకటో వార్డు అడ్లూర్‌లో జరుగుతున్న భూముల సర్వే ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియ చేపట్టాలన్నారు. వివరాలను సర్వే యాప్‌లో పొందుపరచాలన్నారు. ఎప్పటికప్పుడు నివేదికలను వెల్లడించాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో రంగనాథ్‌రావు, పుర కమిషనర్ సుజాత, తహసీల్దారు జనార్దన్, ఆయా శాఖల సిబ్బంది ఉన్నారు.


అడ్లూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపిక

భిక్కనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు భిక్కనూరు జడ్పీహెచ్ఎస్ బాలుర పదో తరగతి విద్యార్థి మెంతెం అనుదీప్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ శుక్రవారం తెలిపారు. ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 17 విలువిద్య పోటీల్లో అనుదీప్ 50 మీటర్ల విభాగం రీకర్వ్ రౌండ్‌లో బంగారు పతకం సాధించాడని పీడీ నర్సింహారెడ్డి తెలిపారు. నవంబరులో వరంగల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు.


విద్యార్థి అనుదీప్‌తో ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్, పీడీ నర్సింహారెడ్డి

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కామారెడ్డి పట్టణంలో విద్యుత్తు పురోగతి పనుల దృష్ట్యా శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. రాధాకృష్ణలాడ్జీ రోడ్డు, జన్మభూమి రోడ్డు, కాకతీయనగర్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీలో విద్యుత్తు సరఫరా రెండు గంటల పాటు నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని కాలోజివాడికి చెందిన మల్లమారి గణేష్(32) గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. గణేష్ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. తల్లి మల్లమారి పోషవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

ఆవులపై విషప్రయోగం

బిచ్కుంద: బిచ్కుంద మండలం వాజీద్‌నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఆవులపై విషప్రయోగం చేశారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి కొంత మంది కారులో వచ్చి గ్రామంలోని ఆవులకు ఇంజక్షన్ ఇవ్వడంతో మూడు ఆవులు మూర్ఛపోయాయని చెప్పారు. మరికొన్ని ఆవులు అస్వస్థతకు గురయ్యాయని పేర్కొన్నారు. కొన్ని రోజుల నుంచి మండలంలో గుర్తు తెలియని దుండగలు ఆవులను ఎత్తుకెళ్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుల ఫొటోలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తం అయ్యాయని చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

కులగణనలో తప్పులు ఉండొద్దు

తాడ్వాయి: తర్వలో చేపట్టే కులగణన సర్వేలో తప్పులు ఉండొద్దని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఆయన తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి 50 కుటుంబాలకు ఒకరు సర్వే చేపట్టనున్నట్లు చెప్పారు. మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో సాజీద్ అలీ, తహసీల్దార్ రహీమొద్దీన్, ఎంపీవో సవిత రెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

పట్టణంలో పలు చోట్ల ఖాళీ స్థలాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. బాన్సువాడ పురపాలిక అయ్యాక స్థలాలకు డిమాండ్ ఏర్పడటంతో పరిసర గ్రామాల ప్రజలు స్థలాలు కొనుక్కొని వదిలేయడంతో అందులో చెట్లు, పొదలు పెరుగుతున్నాయి. ఈ ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం, అక్కడికి డ్రెనేజీ నీరు చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు, పందుల బెడద ఉంది.



అర్ఫత్‌కాలనీలోని ఖాళీ ప్రదేశంలో పిచ్చి మొక్కలు ఇలా..

పట్టణంలో ఇలా..

పట్టణంలోని సాయికృపానగర్, వాసవీకాలనీ, ఎన్‌జీవోఎస్, ఫిర్దోస్, అర్ఫత్, హనుమాన్ కాలనీల్లో నీరు నిలిచి వ్యర్థాలు కుళ్లిపోవడంతో దుర్వాసన వ్యాపిస్తుంది. ఖాళీ ప్లాట్లలో ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో విష కీటకాలు, పాములు తిరుగుతున్నాయి. అపరిశుభ్రత లేకుండా స్థలాలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

స్థల యజమానులు తమ ప్లాట్లలో ఎప్పటికప్పుడు పరిశుభ్రత చర్యలు చేపట్టాలి. కానీ కొందరు స్థలాలు కొని రిజిస్ట్రేషన్ చేయించుకొని వదిలేస్తున్నారు. దీంతో ఆ స్థలాలు మురికికూపాలుగా మారుతున్నాయి. సంబంధిత యజమానులకు అధికారులు అడపాదడపా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. కొందరి వివరాలు తెలియక నోటీసులు ఇవ్వడం లేదు. ఖాళీ స్థలం పన్ను(వీఎల్‌టీ) చెల్లించాల్సి ఉంటుంది. అసలు పురపాలిక పరిధిలో ఎన్ని ఖాళీ స్థలాలు ఉన్నాయో కూడా సిబ్బంది దగ్గర సరైన వివరాలు లేవు.

చర్యలు తీసుకుంటాం

- శ్రీహరిరాజు, బల్దియా కమిషనర్, బాన్సువాడ



పట్టణంలోని ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఖాళీ స్థలాలు గుర్తించి పలువురికి నోటీసులు జారీ చేశాం. సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతాం. స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి వారి నుంచి పన్ను వసూలు చేస్తాం.

ఏషియన్ ప్రియా సినీప్లెక్స్

లక్కీ 11.15, 2.15, 6.15, 9.15

విశ్వం 11.00 2.00 6.00 9.00

వి సినిమా శాంతి : దేవర 5.50 9.15

ఏషియన్ దర్పన్ : వెనం ది లాస్ట్ డ్యాన్స్ 11.00 6.00

పొట్టేల్ : 2.00 9.00

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242

స్పందన: కామారెడ్డిలోని భవానీరోడ్డులో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదు. స్థానికుడు రఘువీర్ ఫిర్యాదు చేయగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ స్పందించి సమస్య పరిష్కరించారు.



భవానీరోడ్డులో చెత్త సేకరిస్తున్న సిబ్బంది

స్పందన: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ ప్రధాన రోడ్డులో కల్వ పూడిక తొలగించలేదని స్థానికుడు శ్రీనివాస్ ఈనాడు దృష్టికి తేగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ స్పందించి పూడిక తీయించారు.



కల్వ పూడిక తీస్తున్న సిబ్బంది

స్పందన: బాన్సువాడ ప్రధాన రహదారి నుంచి టీచర్స్ కాలనీ వెళ్లే దారిలో రోడ్డు వెంట పిచ్చి మొక్కలతో పరిసరాలు అధ్వానంగా మారాయని స్థానికుడు రాములు సమస్యను వివరించగా పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు స్పందించి పారిశుద్ధ్య పనులు చేయించారు.



స్పందన: రెడ్డిపేట్‌లో ప్రధానరోడ్డుపై గుంతలు ఉండడంతో నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వివరించగా కార్యదర్శి నరేష్ స్పందించి మొరం పోయించారు.

సమస్య: మద్నూర్‌లోని ఎల్లమ్మ గల్లీ, రథం గల్లీలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **-గంగారాం, మద్నూర్**

సమాధానం: సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. **-సందీప్, కార్యదర్శి మద్నూర్**

సమస్య: పిట్లం మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. **రాజేశ్, స్థానికుడు**

సమాధానం: శుభ్రం చేయిస్తాం - **శాంతి, వసతి గృహ వార్డెన్, పిట్లం**

సమస్య: పోచారం గ్రామానికి వెళ్లే దారి పక్కన నిర్మించిన నీటి తొట్టి నాచుతో నిండింది. **-కాశీనాథ్, స్థానికుడు**

సమాధానం: త్వరలో శుభ్రం చేస్తాం. **భానుచందర్, ఇన్‌ఛార్జి కార్యదర్శి**

– న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం, కామారెడ్డి పట్టణం, మద్నూర్ పిట్లం, పెద్దకొడప్‌గల్, రామారెడ్డి,

సభ్యత్వ నమోదు

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గంగారాం ఆధ్వర్యంలో భాజపా సభ్యత్వ నమోదు చేపట్టారు. ఓబీసీ రాష్ట్ర ప్రతినిధి వెంకట్, నాయకులు స్వామి యాదవ్ తదితరులు ఉన్నారు.

రుణమాఫీపై సహ చట్టం దరఖాస్తు

దోమకొండ, న్యూస్‌టుడే: మూడు విడతల్లో రుణమాఫీ పంపించని విషయమై కారణాలను కోరుతూ అధికారిక వివరణ ఇవ్వాలని దోమకొండ యువసేన-97 సభ్యులు శుక్రవారం కెనరా బ్యాంకు మేనేజర్ రాజేశ్‌కు దరఖాస్తు అందజేశారు. అర్హులుగా ఉండి రుణ మాఫీ కాకపోవడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనేక మందికి ఎందుకు రుణం మాఫీ కాలేదని ప్రశ్నించారు. సభ్యులు రాజేందర్, పురుషోత్తం, రాములు పాలొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు ఆనందం, ఎన్ఎండీసీ మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ పద్మారావు పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు కౌసర్, శంకర్, ఏఎస్‌రావు, నారాయణ, పోశెట్టి, ఫరిద్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలని డిమాండ్



నినాదాలు చేస్తున్న కార్మికులు

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే : బల్దియా కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఖలీల్ పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. రూ. 26వేలు వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘం అధ్యక్షుడు సాయిలు, రాజు, శివరాజులు, రాజేశ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

‘అన్నదాతలను ఇబ్బంది పెట్టొద్దు’

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: రైస్‌మిల్లర్లు వద్ద కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు యత్నిస్తే మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గోనె సంచుల కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్‌గౌడ్, నర్సింలు తదితరులున్నారు.

రోడ్డెక్కిన రైతన్న!

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో తూకం ప్రారంభించాలని మెదక్ ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రైతులు శుక్రవారం బైఠాయించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ... ధాన్యం కేంద్రాలకు తరలించి 20 రోజులు అవుతున్నా తూకం వేయడం లేదని మండిపడ్డారు. అకాల వర్షాలకు ధాన్యం తడసి ముద్దవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇచ్చారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజదాస్ తదితరులు పాల్గొన్నారు.



మొరం పోయించారు..

గంగమ్మ వాగు వంతెన వద్ద సర్వీస్ రోడ్డు చిన్నగా ఉండడంతో వాహనాలు బోల్తా పడటంపై ఈనాడులో ‘పనులు జాప్యం... ప్రమాదాలు నిత్యకృత్యం’ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డుపై మొరం పోయించారు. పనులు త్వరగా పూర్తి చేసేలా ఆదేశాలు ఇస్తామని ఏఈ రవితేజ తెలిపారు.

-రామారెడ్డి, న్యూస్‌టుడే



కుటుంబ సర్వేపై సమావేశం



మాట్లాడుతున్న బల్దియా కమిషనర్ శ్రీహరి రాజు

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: సామాజిక ఆర్థిక కుటుంబ సర్వేకు సన్నద్ధంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు పేర్కొన్నారు. పట్టణంలోని కార్యాలయంలో శుక్రవారం ఎన్యుమరేటర్లతో కుటుంబ సర్వేపై సమావేశం నిర్వహించారు. సర్వేకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి, అధికారులు శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: బిచ్కుంద సీహెచ్‌సీలోని పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు డిమాండ్ చేశారు. పట్టణంలోని సహాయ కార్మికశాఖ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. సంబంధిత ఏజెన్సీ కార్మికులను ఇష్టారాజ్యంగా తొలగించడం సరికాదన్నారు. ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు వెంకటేష్, ఇమ్రాన్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

28న ధర్మయుద్ధ మహాసభ

మాచారెడ్డి, న్యూస్‌టుడే: ఎల్లంపేట, సోమారంపేట, రత్నగిరిపల్లి రాజ్‌ఖాన్‌పేట గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్మయుద్ధ మహాసభ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 28 తేదీన కామారెడ్డిలో జరిగే ఈ మహాసభకు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రమేశ్, నాయకులు నాగరాజు, కుమార్, దేవరాజు, లక్ష్మినర్సు, రాములు, ఎల్లయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనం మంజూరు చేయాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో పాఠకుల సౌకర్యార్థం భవనాన్ని మంజూరు చేయాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండలంలో 27 పంచాయతీలున్నాయన్నారు. మండల ప్రజలకు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగుల సౌకర్యార్థం గ్రంథాలయాన్ని అందుబాటులోకి తేవాలన్నారు.

అవీ...ఇవీ.. అన్నీ



వాసవీమాత ఆలయంలో లలిత సహస్రనామార్చనలో పాల్గొన్న భక్తులు

సహస్రనామార్చన

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని సిరిసిల్లరోడ్డులో వాసవీమాత ఆలయంలో శుక్రవారం లలిత సహస్రనామార్చన జరిగింది. భక్తులు పాల్గొని పారాయణం నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పారాయణం

కామారెడ్డి పట్టణం: జిల్లాకేంద్రంలోని ఇల్చిపూర్ సరస్వతీక్షేత్రంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో పారాయణం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువత రక్తదానానికి ముందుకు రావాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: యువత రక్తదానానికి ముందుకు రావాలని పుర ఛైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్నవారికి యువత అండగా నిలవాలన్నారు. ప్రిన్సిపల్ విజయ్ మాట్లాడుతూ.. తలసేమియా బాధితులకు అండగా రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో రక్తం సేకరించడం అభినందనీయమన్నారు. ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర ఛైర్మన్ బాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఈవో తనిఖీ

బాన్సువాడ గ్రామీణం, న్యూస్‌టుడే: బోర్లం గ్రామ పంచాయతీని మండల ప్రత్యేకాధికారి, డీఈవో రాజు శుక్రవారం సందర్శించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని, పల్లె ప్రకృతి వనాన్ని, జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిర్ణీత గడువులోగా ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, భూకొలతలశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్ని రకాల ధ్రువపత్రాలు, భూసంబంధిత కేసులు, భూసేకరణ, మానవహక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్, ప్రభుత్వ భూముల సంరక్షణ, ప్రత్యేక ఓటరు నమోదు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై సమీక్ష కొనసాగింది. ధరణికి సంబంధించి నిత్యం రెండు మండలాల అధికారులతో మాట్లాడతానని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు రంగనాథ్‌రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోడప్రతుల విడుదల

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అఖిల భారత పశుగణన గోడప్రతులను జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం విడుదల చేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు జిల్లాలో పశుగణన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 113 మంది ఎన్యూమరేటర్లు, 25 మంది పర్యవేక్షకులు కలిసి అన్ని గ్రామాల్లోని గేదెలు, ఎద్దు, ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్లు, యంత్ర సామగ్రి, ఫిషరీస్ యంత్ర సామగ్రి వంటివి గణిస్తారని పేర్కొన్నారు. పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి సంజయ్‌కుమార్, పశువైద్యులు శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులను ఆదుకోండి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: బీసీ చేతి వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ వెంకట్‌గౌడ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బీసీ కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లా జనాభాలో సగంమందికి పైగా చేతి వృత్తిదారులు ఉన్నారన్నారు. అర్హులకు మూడెకరాల భూమి, నెలకు రూ.5వేల చేయూత పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు శివరాం, విఠల్, రాజయ్య, మైనిద్దీన్, లక్ష్మణ్, రమేశ్, శ్రీనివాస్, నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ వెంకట్‌గౌడ్

ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

జుక్కల్, న్యూస్‌టుడే: ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థులతో కలిసి శుక్రవారం నిరసన చేపట్టారు. బసవేశ్వర చౌక్ నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం తహసీల్దార్ హిమబిందుకు వినతి సమర్పించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు షేక్ ఫిర్దోస్, నాయకులు ఈశ్వర్, జేమల్, అక్షయ్ తదితరులు ఉన్నారు.



జుక్కల్: నినాదాలు చేస్తున్న నాయకులు

పారిశుద్ధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు

సదాశివనగర్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ అన్నారు. సదాశివనగర్ మండలం భూంపల్లిలో శుక్రవారం పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా పరిశీలించారు. చెత్త సేకరణ ప్రతి రోజు జరపాలన్నారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్ రెడ్డి, ఏపీఎం రాజిరెడ్డి, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మధు, కార్యదర్శి ప్రకాశ్ తదితరులు ఉన్నారు.



పల్లె దవాఖాన పరిసరాలు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో చందర్‌నాయక్



సీఎంను కలిసిన ఎమ్మెల్యే

జుక్కల్, న్యూస్‌టుడే: జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తోట శుక్రవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోనే మొదటిసారిగా బిచ్కుందలోని ఐటీఐ కళాశాలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసినందుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. తమ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

దారిని కప్పేసిన ధాన్యం

రోడ్డును పూర్తిగా కప్పేసి ధాన్యం ఆరబోసిన ప్రాంతం జంగంపల్లి శివారు తెవివి దక్షిణ ప్రాంగణంలోనిది. అంతంపల్లి సొసైటీ వద్ద కల్లంలో ధాన్యం కుప్పలు నిండిపోవడంతో ఆ గ్రామ రైతులు దక్షిణ ప్రాంగణంలోని అంతర్గత రోడ్డుపై ఈ విధంగా ఆరబోశారు. కొనుగోలు కేంద్రం తెరిచినా కాంటాలు వేయడం లేదని రైతులు వాపోయారు. రాత్రి వేళ సైతం ధాన్యం కుప్పల వద్ద కాపలా ఉండాల్సి వస్తోందని, ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, భిక్కనూరు**



క్రైమ్ కార్నర్

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

రాజంపేట, న్యూస్‌టుడే: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శేర్‌శంకర్ తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. తండాకు చెందిన కాట్రోత్ శ్రీనివాస్ (26) శుక్రవారం పొలం వద్ద ఉరేసుకున్నాడని పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియదని, బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయలేదని ఎస్సై పుష్పరాజు తెలిపారు.

రైలుకు ఎదురెళ్లి బలవన్మరణం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని ఆర్‌బీనగర్ కాలనీ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలుకు ఎదురెళ్లి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపారు. మృతుడి బలవన్మరణానికి కారణాలు తెలియరాలేదు. ఇతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోగా.. అతడి చేతిపై ఉన్న పచ్చబొట్టు ఆధారంగా మహారాష్ట్ర.. లేదంటే భైంసా ప్రాంతానికి చెందిన వ్యక్తి అయి ఉంటారని భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: ఉపాధికోసం వచ్చి విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలం అజామాబాద్‌లో గురువారం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటకకు చెందిన యువరాజ్(35) వరికోతలు కోసేందుకు హార్వేస్టర్ మిషన్ హెల్పర్‌గా పని చేయడానికి నాలుగు రోజుల కిందట అజామాబాద్‌కు వచ్చాడు. హార్వేస్టర్‌పైన వెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చెరువులో మృతదేహం లభ్యం

రాజంపేట, న్యూస్‌టుడే: కొండాపూర్‌కు చెందిన వివాహిత నీరడి చంద్రవ్వ (56) మృతదేహం చెరువులో లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. చంద్రవ్వకు మతిస్థిమితం సరిగా లేదు. ఈ నెల 22వ తేదీన రాత్రి ఇంట్లో భర్త కిష్టయ్య నిద్రిస్తుండగా ఆమె బయటకు వెళ్లింది. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామంలోని మామిడొని చెరువులో ఆమె మృతదేహం శుక్రవారం కనిపించింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుష్పరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

బీర్కూర్, న్యూస్‌టుడే: కిష్టాపూర్ శివారులో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపూర్‌కి చెందిన గైని గంగారం అనే రైతు పొలం వద్ద గురువారం రాత్రి ధాన్యం ఆరబెట్టి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో బీర్కూర్ నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం గంగారాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆయనను నిజామాబాద్ ఆసుపత్రిలో చేర్పించారు.

వ్యక్తి మృతి

బాన్సువాడ, న్యూస్‌టుడే : బాన్సువాడలోని సరస్వతి మందిరం సమీపంలో గురువారం రాత్రి రోడ్డుపై ఓ వ్యక్తి మృతి చెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించారు. విచారణ చేయగా బుడ్మికి చెందిన పడాల బాల్‌రాజ్(35)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు పెళ్లి జరిగిన కొన్ని రోజులకే అతని భార్య వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసై గ్రామాన్ని వదిలి బాన్సువాడలో కొన్నేళ్లుగా కూలీ పనిచేస్తూ జీవించేవారు. ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని గ్రామస్థులు అనుమానిస్తున్నారు.

ముగ్గురిపై వరకట్నం కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం మోషన్‌పూర్ గ్రామానికి చెందిన ముగ్గురిపై వరకట్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ శుక్రవారం రాత్రి తెలిపారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన అఖిలకు 2014 ఏప్రిల్ 16న మోషన్‌పూర్‌వాసి నరేశ్‌తో వివాహమైందని పేర్కొన్నారు. అన్ని లాంఛనాలతో పెళ్లి చేసినప్పటికీ పుట్టింటి నుంచి రూ. 5 లక్షలు అదనంగా తీసుకురావాలంటూ అఖిలను ఆమె భర్త నరేశ్, ఆడబిడ్డ కృష్ణవేణి, ఆడబిడ్డ భర్త చంద్రం మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేశారని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాల బస్సు, లారీ ఢీ

సదాశివనగర్: లింగంపల్లి శివారులోని కామారెడ్డి- బాన్సువాడ రహదారిపై ఓ ప్రైవేటు పాఠశాల బస్సు, లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలైనట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. పద్మాజివాడి క్రాసురోడ్డులోని స్ప్రింగు ఫీల్డుకు చెందిన స్కూల్ బస్సు సాయంత్రం గాంధారి వైపు వెళ్తుండగా, గాంధారి నుంచి పద్మాజివాడిక్రాసురోడ్డుకు వస్తున్న లారీ ఢీకొన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కల్లు దుకాణాలపై దాడులు

బీర్కూర్, నస్రుల్లాబాద్ న్యూస్‌టుడే: బీర్కూర్, బైరాపూర్, నస్రుల్లాబాద్, నెమ్లి, మైలారం గ్రామాల్లోని కల్లు దుకాణాలపై బాన్సువాడ ఆబ్కారీ సీఐ యాదగిరిరెడ్డి, సిబ్బంది శుక్రవారం దాడులు చేసి నమూనాలు సేకరించారు. కల్తీ కల్లు తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్లు దుకాణాలతో పాటు మద్యం దుకాణాలను సైతం పరిశీలించారు. మద్యాన్ని ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయించొద్దని సూచించారు.

జిల్లా ఇన్‌ఛార్జి పశువైద్యాధికారిగా సంజయ్‌కుమార్



కామారెడ్డి వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి పశువైద్యాధికారిగా సంజయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇన్నాళ్లు ఇక్కడ పనిచేసిన డాక్టర్ శ్రీనివాస్ వరంగల్ జిల్లా మామునూరు పశువైద్య విశ్వవిద్యాలయానికి బదిలీ అయ్యారు. జిల్లా పశువైద్య కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న సంజయ్‌కుమార్‌ను జిల్లా ఇన్‌ఛార్జి పశువైద్యాధికారిగా నియమించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

గాంధారి, న్యూస్‌టుడే: మండలంలోని మేడిపల్లి, పేట్‌సంగెం, సీతాయిపల్లి, గౌరారం, కరక్‌వాడి తదితర గ్రామాల్లో డీపీఎం రమేష్‌బాబు శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఏఎంసీ ఛైర్మన్ పరమేశ్, అడిషనల్ డీఆర్‌డీవో మురళీకృష్ణ, ఏవో రాజలింగం తదితరులు ఉన్నారు.

లింగంపేట, న్యూస్‌టుడే: లింగంపేట మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీవో సురేందర్ పరిశీలించారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డీపీఎం రమేష్‌బాబు